మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



గన్నవరం విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్, ఎస్ఐ



ఉయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఈబీ అధికారులు, పోలీసులు, విద్యార్థులు

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన
- డ్రగ్స్ వినియోగంతో జీవితాలకు ముప్పు

గన్నవరం: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని గన్నవరం సీఐ వరప్రసాద్ సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ...మత్తు పదార్థాలకు బానిసై ఎంతో మంది యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. ధూమపానం, మద్యపానంతో సరదాగా మొదలయ్యే ఈ అలవాట్లు చివరికి మాదక ద్రవ్యాల వినియోగానికి దారి తీస్తుందన్నారు. దీనివల్ల ఆర్థికంగా, మానసికంగా, శరీరకంగా యువత తీవ్రంగా దెబ్బతింటున్నారని తెలిపారు. ఒకప్పుడు నగరాలకు పరిమితమైన మత్తు పదార్థాల జాడ్యం ప్రస్తుతం గ్రామాలకు సైతం విస్తరిస్తోందన్నారు. మాదకద్రవ్యాలను రకరకాల రూపాల్లో యువతకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. వీటిని అరికట్టేందుకు, భావితరాల భవిష్యత్‌ను కాపాడేందుకు పోలీస్ శాఖకు విద్యార్థులు సహకరించాలని కోరారు. మత్తు పదార్థాల విక్రయాలపై ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ శివప్రసాద్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పడమట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

ఉయ్యూరు: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే అందరి లక్ష్యం కావాలని ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదం, ముప్పుపై అవగాహన కల్పిస్తూ సోమవారం పట్టణంలోని ఏజీఅండ్ఎస్‌జి సిద్ధార్థ కళాశాల విద్యార్థులతో కలిసి పోలీసులు, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ హబీబ్ బాషా మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వల్ల జీవితాలు దుర్భరంగా మారుతాయన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, జీవితాలను బంగారుమయంగా మార్చుకోవాలని సూచించారు. పలు ఐపీసీ సెక్షన్‌లను కఠినతరం చేశారని సీఐ హబీబ్ బాషా చెప్పారు. ఈ సెక్షన్‌లు ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సాగునీరందేది ఎలా..?

- బందరు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క
- సీజన్ ప్రారంభం కావడంతో రైతుల్లో ఆందోళన
- పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి



బందరు కాలువలోని గుర్రపుడెక్క

పెనమలూరు: జిల్లాలో రైతాంగానికి సాగునీరు అందించే బందరు కాలువ పూడిక తీత పనులు ఎప్పుడు చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది. బందరు కాలువ ప్రసుత్తం పూర్తిగా గుర్రపుడెక్క, వ్యర్థాలతో నిండిపోయింది. మండల పరిధిలో బందరు కాలువ యనమలకుదురు నుంచి గోసాల వరకు విస్తరించి ఉంది. బందరు కాలువలో సాగు నీరు దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తోంది. ప్రతి ఏడాది వేసవిలో బందరు కాలువలో పూడికతీత పనులు చేపట్టే వారు. అయితే ఇప్పుడు సార్వా సీజన్ మొదలువతున్నా ఇప్పటి వరకు బందరు కాలువ పూడిక తీత పనులు చేయలేదు. పూడిక తీత పనులు చేస్తారో లేదో రైతులకు సమాచారం కూడా అధికారులు చెప్పటంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో దాదాపు 12 కిలోమీటర్ల మేర బందరు కాలువ పూర్తిగా గుర్రపు డెక్కతో పూడుకుపోయి ఉంది. జిల్లాలో శివారు ప్రాంతాలతో పాటు మండలంలో మెరక ప్రాంతాలకు సాగు నీరు అందాలంటే బందరు కాలువ పూడిక తీత పనులు వెంటనే చేపట్టాలి. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి జిల్లా వాసులకు జీవనాడిగా ఉన్న బందరు కాలువ పూడిక తీత పనులు వెంటనే చేయించాలని రైతులు కోరుతున్నారు.

డీఎల్పీఓగా మూర్తి బాధ్యతల స్వీకరణ



విజయవాడరూరల్: విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారిగా బీహెచ్ఎస్ఎస్ఎన్ మూర్తిని ప్రభుత్వం నియమించింది. పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న మూర్తి సోమవారం డీఎల్పీఓగా సోమవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.టి.వి.రమణ(నున్న), జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామ్మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షులు జి.మస్తాన్‌రావు, ప్రకాష్‌నాథ్‌లు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ పాలనకు అనుగుణంగా ఉద్యోగులందరూ సహాయ సహకారాలు అందజేయాలని కోరారు.

ఇంద్రకీలాద్రిపై సుందరకాండ పారాయణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై సోమవారం హనుమాన్ జంక్షన్‌కు చెందిన ముముక్షు భజన మండలిచే సుందరకాండ పారాయణ జరిగింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు భజన మండలికి చెందిన సులోచన బృందం సుందరకాండను ముక్తకంఠంతో ఆలపించారు. అమ్మవారిని దర్శించుకుని ఆరు బయటకు వచ్చిన భక్తులు కళావేదిక వద్ద జరుగుతున్న పారాయణను ఎంతో ఆసక్తితో విని పులకించారు. సుందరకాండ పారాయణతో పాటు హనుమాన్ చాలీసా, శ్రీ విష్ణు, లలితా సహస్ర నామ పారాయణ, శ్రీ భగవద్గీత పారాయణ, అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం భక్త బృందంలోని భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నగరవాసుల ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు ఇదొక మంచి అవకాశం అని చెప్పారు. ప్రతి సోమవారం ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో తమ ఫిర్యాదులను తీసుకొచ్చి సత్వరమే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 8 ఫిర్యాదులు అందగా అందులో రెండు ఇంజినీరింగ్ విభాగం, ఒకటి ప్రజారోగ్యం, నాలుగు టౌన్ ప్లానింగ్, ఒకటి యూసీడీ విభాగాలకు చెందిన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్ కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 1- ఏ ఎస్ ఎన్ ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ (అమృత్) లతా, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి. సోమశేఖర్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ రామ్మోహన్ రావు, ఎకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

144 నిషేధాజ్ఞలు మరో 50 రోజుల పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో 144 సీఆర్పీసీ నిషేధాజ్ఞలను మరో 50 రోజుల పాటు పొడిగిస్తూ పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం సోమవారం నుంచి ఈ ఏడాది ఆగస్టు 12వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. దీని ప్రకారం జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, టు టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాల్లో నలుగురు, అంతకు మించిన వ్యక్తులు ఒకే చోట గుమిగూడదని, కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలను పట్టుకుని సంచరించడం చేయకూడదని తెలిపారు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీనివాసునికి పుష్పయాగం

- స్వామి వారి అర్చనకు సప్తవర్ణ పుష్పాలు
- వైభవంగా ఇరు దేవేరులతో స్వామి వారి నగరోత్సవం
- నేడు మహా పూర్ణాహుతి



వేదికపై కొలువు తీరిన శ్రీవెంకటేశ్వర స్వామి వారు



పుష్పార్చనను వీక్షిస్తున్న భక్తజనం



నగరోత్సవ సేవ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు స్వామి వారికి పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిత్యహోమాలు, బలిహరణలను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆస్థాన మండపంలోని వేదికపై ఇరు దేవేరులతో కొలువు తీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు విశేష పుష్పార్చన జరిపారు. స్వామి వారి సేవకు తులసీ, మురవం, సన్నజాజులు, మల్లెలు, తెల్ల చామంతి, పచ్చ చామంతి, కాగడాలు, కనకాంబరాలు వంటి పుష్పాలతో అర్చన చేపట్టారు. ఒక్కో ఉత్తమ జాతి పుష్పాలతో అర్చన నిర్వహిస్తున్న అర్చన విశిష్టతను ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు చక్కటి వ్యాఖ్యానంతో భక్తులకు వివరించారు. అనంతరం భక్తులు, ఆలయ పాలక మండలి సభ్యులచే స్వామి వారికి పూజలు జరిపించారు. పుష్పయాగాన్ని వీక్షించేందుకు విచ్చేసిన భక్తజనంతో కల్యాణ మండపంలో పండుగ వాతావరణం కనిపించింది. గోవింద నామస్మరణ మధ్య భక్తులు స్వామి వారి సేవను వీక్షించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిత్య హోమాలు, బలిహరణాదులు, మహా శాంతి హోమాన్ని ఆలయ అర్చకులు జరిపించారు.

వైభవంగా గరుడవాహన సేవ ...

ఇరు దేవేరులతో కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై కొలువు తీరి నగర పుర వీధుల్లో విహరించారు. చిట్టినగర్‌లోని స్వామి వారి ఆలయం నుంచి బయలుదేరిన నగరోత్సవం కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, కోమల విలాస్ వరకు సాగింది. అక్కడి నుంచి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఊరేగింపును ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, గౌరవ అధ్యక్షులు బెవర శ్రీనివాసరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులు నగరోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారికి భక్తులు హారతులిచ్చి స్వాగతం పలికి, పూజలు జరిపించుకున్నారు. ఉత్సవాలను కమిటీ సభ్యులు పొట్నూరి దుర్గాప్రసాద్, మజ్జి ఈశ్వరరావు, కామందుల నరసింహరావు, పిళ్లా విజయ్, పోతిన బేసు, మజ్జి శ్రీనివాసరావు, గూడెల రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

నేడు వసంతోత్సవం, పూర్ణాహుతి

వార్షిక బ్రహ్మోత్సవాల్లో 5వ రోజైన మంగళవారం ఉదయం వసంతోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తారు. పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు లాంఛనంగా పూర్తవుతాయి. సాయంత్రం స్వామి వారికి పవళింపు సేవ జరుగుతుంది.

దొండ తోటల్లో తెగుళ్ల నివారణకు చర్యలు



చిన ఓగిరాలలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త వీరబాబు

ఉయ్యూరు: దొండ తోటల్లో వైరస్ తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ శాస్త్రవేత్తలు వీరబాబు, ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి డాక్టర్ కె.దక్షిణామూర్తి, సహాయ అధికారి డాక్టర్ టి.ప్రేమ రంజితం సూచించారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో దొండ తోటల్లో వైరస్ తెగుళ్ల నివారణపై సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త వీరబాబు మాట్లాడుతూ.. వైరస్ సోకిన మొక్కను తొలగించి, పొలానికి దూరంగా కాల్చివేయాలన్నారు. రసం పీల్చే పురుగు తెల్లదోమ, తామర పురుగు వల్ల వైరస్ తెగులు వ్యాప్తి చెందుతుందని చెప్పారు. రసం పీల్చే పురుగు నివారణకు వేప పిండి ఎకరాకు 15 కిలోలు మొక్క పాదుల్లో వేసుకోవాలన్నారు. పొంగెమియా, సోప్, బవేరియా, వేప నూనె 1500 పీపీఎం 3 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తెగుళ్లు ఆశించకుండా ముందుగానే చివరి దుక్కిలో పశువుల ఎరువు 10 టన్నులుతో వేప పిండి 50 నుంచి 100 కిలోలు వరకూ, 200 కిలోలు ఎస్ఎస్‌పీ 33 కిలోలు ఎంఓపి కలిపి వేయటం ద్వారా మొక్కకు పోషకాలు సమృద్ధిగా అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు సురేష్, చందు, ఉద్యాన అధికారి నాగదేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వాదోపవాదాల మధ్య సాధారణ సమావేశం



సాధారణ సమావేశంలో పలు అంశాలను చర్చిస్తున్న పాలకవర్గ సభ్యులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం వాదోపవాదాల మధ్య సాగింది. తొలుత పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అజెండాలోని అంశాలను పాలకవర్గ సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో వార్డు సభ్యులు మాదు సుబ్బారావు, కోనేరు వెంకట నారాయణ మధ్య మాటల యుద్ధం జరిగింది. గత టీడీపీ పాలకవర్గంలో ఒక ఇంటి కోసం నల్లూరివారి కట్ట రోడ్డు అభివృద్ధి చేసుకున్న విషయం నిజం కాదా అని సుబ్బారావు ప్రశ్నించడంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో సమావేశంలో సభ్యులు కలుగజేసుకుని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. పలువురు ఎంపీటీసీ, వార్డు సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలోని రామయ్య చెరువు కాలుష్యమై తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని, అపార్టుమెంట్లలోని మురుగు చెరువులో కలుపుతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ రాచమళ్ల రత్నకుమారి సమావేశంలో ప్రస్తావించారు. గ్రామంలో తాగునీటి సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారానికి నోచుకోలేదని నూతనంగా నిర్మించిన ట్యాంకులకు పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వాలంటూ వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు, కుమారి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న పలు రహదారులు, డ్రెయిన్ల మరమ్మతులు, జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్ల పూడికతీసే అంశాలను పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

పారిశ్రామిక కారిడర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు



పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం: బాపులపాడు మండలంలోని మల్లవల్లి ఇండస్ట్రియల్ ఏరియా అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయానికి విచ్చేసిన పారిశ్రామిక కారిడర్‌లోని 24 మంది పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తల సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులపై ఆయన ఆరా తీశారు. అనంతరం యార్లగడ్డ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు నెలకొల్పేందుకు ఔత్సాహికులు ముందుకురావాలని కోరారు. పారిశ్రామిక ఇండస్ట్రియల్ ఏరియాలో నెలకొన్న సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించానని తెలిపారు. అంతే కాకుండా కారిడర్‌లో అవసరమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించానన్నారు. ఇక్కడ పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహాయ, సహకారాలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు.

ఎన్ఎస్ఎం పూర్వవిద్యార్థుల నూతన కమిటీ ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన పూర్వవిద్యార్థుల కమిటీ

పటమట(విజయవాడతూర్పు): ఎన్ఎస్ఎం స్కూల్ పూర్వవిద్యార్థుల నూతన కమిటీ ఏర్పాటైంది. పూర్వవిద్యార్థుల సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా నల్లూరి వెంకట జగదీష్, కార్యదర్శిగా గుర్జిత్‌సింగ్ సహాని, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా కూరేటి జయనారాయణ, జూనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా జయదీర్ అర్హా, సీనియర్ సెక్రటరిగా అయేషా, జూనియర్ సెక్రటరీగా సుహృతి, ట్రెజరర్‌గా కొత్తా వెంకట సుబ్బారావు ఎన్నికయ్యారు. అనంతరం వీరితో పాఠశాల ప్రిన్సిపాల్ బాలారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నల్లూరి వెంకట జగదీష్ మాట్లాడుతూ పాఠశాల ప్రారంభమై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఆరు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఎన్ఎస్ఎం పరుగు, ఎన్‌పీఎల్ స్పోర్ట్స్‌డే, కల్చరల్ ఫెస్ట్, హిస్టారికల్ ఎగ్జిబిట్, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించటంతోపాటు ప్రతి ఏడాది పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ఆఫీస్ బేరర్స్ మూడేళ్లపాటు కొనసాగుతారన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి తెలిసిన వారి వద్ద అప్పులు చేసిన యువకుడు అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై యువకుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేఎల్‌రావు నగర్ కర్మెల్ చర్చి ప్రాంతానికి చెందిన దివి రాజేష్‌బాబు, వాసంతి భార్యాభర్తలు, రాజేష్‌బాబు బంగారపు పని చేస్తుంటాడు. రాజేష్‌కు క్రికెట్ బెట్టింగ్‌లు పెట్టే అలవాటు ఉంది. కొద్ది నెలల కిందట క్రికెట్ బెట్టింగ్‌లో భారీ మొత్తంలో డబ్బులు పెట్టాడు. అయితే ఆర్థికంగా నష్టపోవడంతో ఏప్రిల్ 22వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి రాజేష్ తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పిల్ల కాలువగా బుడమేరు పిల్లికోడు డ్రెయిన్



ఉంగుటూరు: ఎలుకపాడులో పిల్ల కాలువగా మారిన పిల్లికోడు డ్రెయిన్‌పై అధికారులు దృష్టి సారించాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ అజ్మీర వెంకటేశ్వరరావు కోరారు. ఎలుకపాడులో ఉన్న పిల్లికోడు బూతుమిల్లిపడు నుంచి ఎలుకపాడులోని బుడమేరులో కలుస్తోందన్నారు. ఈ కాలువ ద్వారా సుమారు 5 వేల ఎకరాలకు మురుగునీరు పోతుందని చెప్పారు. పిల్లికోడు పూడిక పెరిగి పోవడంతో పిల్లికోడు పిల్లకాలువగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బుడమేరు పిల్లికోడును అభివృద్ధి చేయాలని కోరారు.

క్లుప్తంగా

వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే



నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నున్న గ్రామంలో వైద్య సిబ్బంది డయేరియా, డెంగీ, మలేరియా జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలోని మూడు హెల్త్ సెంటర్ల పరిధిలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాత టైర్లలో, కొబ్బరిబొండాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, అదే విధంగా వర్షం నీరు కూడా నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వర్షం నీరు నిల్వ ఉన్న ప్రాంతాల నుంచి దోమలు గుడ్లుపెట్టి అభివృద్ధి అవుతాయని ఆ దశలోనే జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తాగునీటిని వేడి చేసి తాగాలని సూచించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా అనారోగ్య సమస్యలు వస్తే సమీపంలోని హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని బీఎంపీఎస్ రోడ్డు, ఆంధ్రాబ్యాంక్ ఏరియా, పాళ్ల బజారు, కోళ్ల ఫారం రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

నేడు కానూరులో..

పెనమలూరు: కానూరులో విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ కొత్త ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. దీని కారణంగా 100 అడుగుల రోడ్డు, సత్య సాయి రెసిడెన్సీ, ఆదర్శ బిల్డర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

పేరంటాలమ్మ సేవలో మాజీ ఎంపీ మురళీమోహన్



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మను సోమవారం రాజమండ్రి పార్లమెంట్ మాజీ సభ్యుడు మాగంటి మురళీ మోహన్ దర్శించుకున్నారు. మురళీ మోహన్ తన పుట్టిన రోజు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి ఆయనను సాదరంగా ఆహ్వానించి అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందజేశారు.

డ్వాక్రా రుణం చెల్లింపులో లీడర్ల చేతివాటం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడుకు చెందిన విజయ మహిళా స్వయం సహాయక సంఘం బ్యాంకు రుణం చెల్లింపులో లీడర్లు అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొంటూ ఆ డ్వాక్రా గ్రూపు సభ్యులు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బ్యాంకు ద్వారా గ్రూపు సభ్యులకు రూ.10 లక్షల రుణం మంజూరు కాగా, ప్రతి నెల సభ్యులంతా సక్రమంగా వాయిదాలు చెల్లిస్తున్నప్పటికీ గ్రూపు కార్యదర్శి, వీవోఏతో కుమ్మక్కై ఆ సొమ్మును స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరుతూ విజయ గ్రూపు సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

దివ్యాంగులకు చేయూత



వించిపేట(విజయవాడపశ్చిమ): అంగవైకల్యంతో బాధపడుతూ ఉపాధి కోసం ఎదురు చూస్తున్న ఇద్దరు దివ్యాంగులకు శ్రీసాయి జ్ఞాన యజ్ఞం ట్రస్ట్ ఆర్థిక చేయూత అందించింది. నగరంలోని సింగ్‌నగర్‌కు చెందిన నాగరాజు గతంలో రోడ్లపై చెప్పులు దుకాణం, బాలు సెల్‌ఫోన్ రిపేరింగ్‌లో శిక్షణ తీసుకున్నాడు. వారి ఆర్థికస్థితి సరిగా లేకపోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపేటలోని శ్రీసాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్ చైర్మన్ తిరుపతి రావు సభ్యులతో కలసి సోమవారం రూ.20 వేలు విలువ చేసే చెప్పులు, సెల్‌ఫోన్ రిపేరు పరికరాలను వారికి అందజేశారు. తమకు ఉపాధి మార్గం చూపించిన ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.